క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



నారాయణపేట రూరల్: పట్టణంలోని పాతబ స్టాండ్ సమీపంలోని శ్రీసాయి ఆస్పత్రిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. డాక్టర్ గండె కార్తీక్‌తో కలిసి ప్రముఖ వైద్యులు శ్రీకాంత్, ప్రణయ్ హాజరై గుండె, నరాలు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అంతకుముందు శిబిరాన్ని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ్‌బట్టడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వైద్యులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం సుమారు 300మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటయ్య, మొల్గాన్‌జనార్ధన్, సాయినాథ్, ఆత్మారాం, కన్నుజగదీష్, ఉమాకాంత్‌గండె, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ధన్వాడ: మండల కేంద్రంలోని అప్పాజినగర్‌లో మంగళవారం సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షల రూపాయలు సీసీరోడ్డు కోసం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వేణు, రఘువీర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చండి

మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామంలో వారం రోజుల నుంచి తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీవీవి సమన్వయకర్త కన్వీనర్ మహేష్‌గౌడ్ తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మరికల్: మండలంలోని జిన్నారం గ్రామ శివారులోని మన్నెవాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గత కొంత కాలంగా కొందరు వ్యక్తులు ఇతర గ్రామాలకు అక్రమంగా మన్నెవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న విషయంపై నిఘా పెట్టి పట్టుకున్న ఎస్ఐ మురళీ తెలిపారు. ట్రాక్టర్ల యజమానులపై కేసునమోదు చేశామన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

నారాయణపేట: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆదేశాలతో ఎల్ఆర్ఎస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌సాగర్, చెన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కృష్ణా:మండల సరిహద్దులోని కృష్ణానది బ్రిడ్జిపై మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో చింటు (18), వాకిటి శివ (19) ఇద్దరికీ తీవ్ర గాయాలైయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. గుడెబల్లూర్ గ్రామానికి చెందిన ఈ ఇద్దరు యువకులు కర్ణాటకలోని శక్తినగర్ నుంచి తమ గ్రామానికి వస్తుండుగా మరో ద్విచక్రవాహనంపై దేవసూగూర్‌కు చెందిన ఇద్దరు నల్లగట్టు మారెమ్మ దేవతకు వచ్చి వారు తిరుగు ప్రయాణంలో బ్రిడ్జిపై ఎదురెదురుగా ఢీ కొనవడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి కర్ణాటకలోని శక్తినగర్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా చింటు అనే యువకుడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్లలో మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గేదె మృతిచెందింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు సుదర్శన్‌కు చెందిన గేదె పొలం శివారులోని మేత మేసుకుంటూ వెళ్తున్న క్రమంలో అక్కడ కర్రలతో ఏర్పాటు చేసుకున్న విద్యుత్‌వైరు ప్రమాదవశాత్తు తగలడంతో మృతిచెందింది. పంచాయతీ కార్యదర్శికి విషయం తెలియచేయడంతో సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. రైతును ఆదుకోవాలని ప్రభుత్వానికి కోరారు.

పట్టాలిచ్చారు.. పంపిణీ మరిచారు

- ఐదు గ్రామాల్లో ప్లాట్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- దశాబ్దాలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఊట్కూర్: ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిన అధికారుల నిర్లక్ష్యం వల్ల పాట్లు పంపిణీ చేయకపోవడంతో.. దశాబ్దాల తరబడి ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో ఇప్పటికీ కిరాయి ఇళ్లలో గుడిసెల్లో కాలం వెళ్లబుచ్చుతున్నారు. లబ్ధిదారులకు కొనుగోలు చేసిన హద్దుల్లో ముళ్లపొదలు పెరిగాయి. మండలంలోని, పెద్దజట్రం, పగిడిమారి, మొగ్దుంపూర్, తిప్రాస్‌పల్లి, ఊట్కూర్ తదితర గ్రామాల్లో 30ఏళ్ల క్రితం ఇళ్లస్థలాల కోసం ఆయా గ్రామాల్లో భూములను కొనుగోలు చేశారు. హద్దులు ఏర్పాటు చేసి రాళ్లు పాతారు. ఇల్లు లేని లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కానీ, ఇళ్ల స్థలాల పంపిణీ చేయకపోవడంతో దశాబ్దాలుగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కొత్త ప్రభుత్వ హయాంలోనైనా ప్లాట్ అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

పెద్దజట్రంలో ఇలా..

పెద్దజట్రంలో సర్వే నం.823లో 4 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి 78 లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. ఇప్పటివరకు హద్దులు గుర్తించి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించలేదు.

మొగ్దుంపూర్‌లో..

గ్రామ శివారులో 2007లో సర్వే నం. 576/ఏలో 2ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 45మందికి పట్టాలు ఇచ్చారు. సర్వేచేసి ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు కేటాయించలేదు.



మొగ్దుంపూర్‌లో ఇళ్ల స్థలాలకోసం కొనుగోలు చేసిన భూమి (ఫైల్)

ఊట్కూర్‌లో..

ఊట్కూర్‌లోని శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన 1977లో అప్పటి ప్రభుత్వం సర్వే నం. 845, 847లో 3 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ కాలని ఏర్పాటుచేసింది. 50మంది నిరుపేదలను గుర్తించి పట్టాలను అందించారు. అట్టి భూమిని సర్వేచేసి హద్దులు చూయించలేదు. దీంతో లబ్ధిదారులు హద్దులు చూయించాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు.

తిప్రాస్‌పల్లిలో...

తిప్రాస్‌పల్లి గ్రామం ఏర్పాటుకోసం 1971, 1979, 1985లో విడతల వారిగా సర్వే నం. 51లో 12-30 ఎకరాలు, సర్వే నం. 52లో 12-24 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 283మంది లబ్ధిదారులకు గుర్తించి ఇళ్ల పట్టాలను అందించారు. వీరిలో 251 మందికి సర్వే చేపట్టి హద్దులు చూయించారు. ఇంకా 32 మందికి సర్వే చేపట్టి హద్దులు చూయించాల్సి ఉంది.

సర్వే చేపట్టి ప్లాట్లు కేటాయించాలి..



ప్రభుత్వం మండలంలో ఊట్కూర్, పగిడిమారి, పెద్దజట్రం, మొగ్దుంపూర్, తిప్రాస్‌పల్లి తదితర గ్రామా ల్లో నిరుపేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. ఇప్పటివరకు ప్లాట్‌లను లబ్ధిదారులకు కేటాయించలేదు. ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

-బీ. నారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు

ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2006లో గ్రామ శివారులో 78మంది నిరుపేదలకు బీసీ కాలనీ పేరిట ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇప్పటి వరకు సర్వేచేసి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించలేదు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేపట్టి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలి.

- గౌరీశంకర్, పెద్దజట్రం, ఊట్కూర్

కలెక్టర్‌కు ఏబీవీపీ నాయకుల వినతి

నారాయణపేట రూరల్: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్ కాళీ ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని మంగళవారం ఏబీవీపీ నాయకులు కలెక్టర్ కోయశ్రీ హర్షకు వినతిప్రతం అందజేశారు. ఈ మేరకు.. సంఘం జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ.. తృణముల్ కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారీతిగా గిరిజనులపై దాడులు, అక్రమ భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు చేస్తున్న ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, పోలీసులు చోద్యం చూస్తున్నారని వాపోయారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంతియాజ్, చరణ్‌రెడ్డి, వెంకటరమణ, వివేకానంద, వెంకటేష్, బన్రాజ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోస్గి: మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన మాణికృప్ప రెండు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ క్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి మృతుడి కుటుంబ నేపథ్యాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా రూ.4.5 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న మండల అధ్యక్షుడు

విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

దామరగిద్ద: విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని మాజీ ఎంపీటీసీ అంజిలయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ముసాపేట్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భారత ప్రజాతంత్ర యువజన విభాగం (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురుకుల మోడల్ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బిందు, బానుప్రకాస్‌లను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లాలప్ప, రంగయ్యగౌడ్, గోవింద్, పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు, చారి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



నర్వ: గ్రామంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంకాల్ మహేష్, బోలుబండ వెంకటేష్, కొండన్న, వెంకటేష్‌గౌడ్, సంతోష్, చంద్రయ్య, మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ రేసులో సీఎన్‌రెడ్డి

దామరగిద్ద: రానున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ఎన్నికల్లో చైర్మన్ పదవీపై మండలంలోని మద్దెల్‌బీడ్‌కు చెందిన సి. నారాయణరెడ్డి ఆశలు పెంచుకున్నారు. ఇప్పటికే పలుసార్లు కుంభం శివకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి గెలుపుకోసం, మద్దెల్‌బీడ్‌లో మెజార్టీ సాధించామని, మండలంలోని వివిధ గ్రామాల్లో సొంత ఖర్చుతో తమవంతు కృషిచేశామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ అవకాశం కల్పించాలని కోరారు.

భక్తులకు సన్మానం



మక్తల్: అయోధ్యలో రాముడిని దర్శించుకొని వచ్చిన మక్తల్‌కు చెందిన తండ్రి నాగప్ప, ఆయన కుమారుడు నరేందర్‌ను మంగళవారం స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్మానించారు. ఎలక్ట్రికల్ సైకిల్‌పై 12 రోజులు ప్రయాణం చేసి అయోధ్యలో రాముడిని దర్శించుకొని రావడం అభినందనీయమన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



కొల్పూర్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా శివతేజ, డీఈఓగా అజయ్, హెచ్‌ఎంగా లావణ్య, ఎంఈఓగా పల్లవి వ్యవహరించారు.హెచ్‌ఎం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చక్క గా పాఠాలు బోధించిన వారికి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. కలెక్టర్‌గా సూఫియాన్, డీఈఓగా సాజిత్, ఎంఈఓగా ఖలీల్ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫజల్, ఉపాధ్యాయులు అబ్దుల్‌గఫార్, అబ్దుల్ కలీం, జరీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని సజనాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం మోహన్‌రెడ్డి సమక్షంలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులుగా పావని, నిహారిక, శివచంద్, లక్ష్మి, దివ్య, శ్రీకాంత్ వ్యవహరించి తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులందరిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, చంద్రకాంత్, శశిధర్‌రెడ్డి, విశ్వేశ్వరయ్య, వెంకటప్ప, ఎంపీటీసీ హన్మంతు పాల్గొన్నారు.



దామరగిద్దలో..



ఊట్కూర్‌లో..

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో మంగళవారం ఉపాధి కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల అకౌంట్ లాక్ కావడంతో గతేడాది చేసిన కూలి డబ్బులు రాకుండా పోయాయని వాపోయారు. పని ప్రదేశంలో టెంటు సౌకర్యం లేదని, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో లేదని, ప్రతి రోజు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కూలిల డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధికి కేవలం రూ.66 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం అంటే ఉపాధిని నిర్వీర్యం చేయడంలో ఒక భాగమని ఆరోపించారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు కూలి రూ.600 ఇవ్వడంతో పాటు ఏడాదికి 200 వందల రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో శంకర్, మహేష్, మొగిలన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదీవెన సభ వాల్‌పోస్టర్ విడుదల



దామరగిద్దలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు



ధన్వాడలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం సాయంత్రం 3గంటలకు నిర్వహిస్తున్న ప్రజాదీవెన సభకు మహబూబ్‌నగర్ జిల్లాలోని యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నరని తెలిపారు.

దామరగిద్ద: పాలమూరు జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ కళాశాల మైదానంలో బుధవారం చేపట్టిన ప్రజా దీవెన సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రజా దీవెన సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్ర ముగింపు సందర్భంగా పాలమూరు ప్రజా దీవెనను నిర్వహిస్తున్నారని సీఎం రేవంత్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో తంబలి రఘు, ఆనంద్, జికె వెంకటప్ప, నాగప్ప, ఆశప్ప పాల్గొన్నారు.

ధన్వాడ: పాలమూరు ప్రజా దీవెన విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు నరహరి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 6న నిర్వహిస్తున్న ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, శివకుమార్, నిరంజన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్, వెంకట్రాములు పాల్గొన్నారు.

మాగనూర్: సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న ప్రజా దీవెన సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ కోరారు. నర్సింహ, రాము, కృష్ణయ్య, మొగులప్ప, రఘు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రామీణ జీవన విధానం తెలుసుకోవాలి



రాంపూర్‌లో గ్రామ ముఖచిత్రం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

నర్వ: గ్రామీణ ప్రజల జీవన విధానం గురించి విద్యార్థులు తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ బండి పర్వతాలు అన్నారు. మంగళవారం రాంపూర్‌లో ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులతో కలిసి గ్రామ ముఖ్య కూడలిలో ముఖచిత్రం వేశారు. ఈ ముఖచిత్రం ఆధారంగా గ్రామంలోని మౌళిక వసతులు, ప్రజల జీవన గమన పరిస్థితులపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని మహిళా సమాఖ్య సభ్యులు తమ పొదుపు, అప్పులు వాటి వల్ల కలిగే లాభాలను విద్యార్థులు సంఘం సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. ప్రొఫెసర్లు డా. బండి పర్వతాలు, డా.మాధురి, హెచ్‌ఎం ఉస్మాన్‌ఖాధార్, ఎంపీటీసీ ఉప్పరి పద్మమ్మ, వార్డు సభ్యులు లలితమ్మ, వెంకటన్న, దేవన్న, నాగరాజు, నర్సింహారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నారాయణపేట రూరల్/మరికల్: తైక్వాండోలో మెడల్స్ సాధించిన విద్యార్థులను మంగళవారం అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు అభినందించారు. మరికల్ పీస్ ఏంజిల్స్ స్కూల్‌కు చెందిన 16మంది చిన్నారులు పాల్గొని 12మంది ఫస్ట్ ప్లేస్‌లో నిలిచారు. వీరిలో ఒకరు గోల్డ్‌మెడల్, 4సిల్వర్ మెడల్స్, 7బ్రౌన్ మెడల్స్‌ను పొందారు. వీరికి స్థానిక జిల్లా క్యాంప్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడిని కలుసుకోగా వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కరాటే నేర్చుకోవడంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కోచ్ వెంకటేష్, ఎస్‌బీ సీఐ రాంలాల్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, కరస్పాండెంట్ మల్లేష్, డైరెక్టర్ తిరుపతయ్య, ప్రిన్సిపాల్ రఘు, పీఈటీ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

మద్దూరు: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యురాలు విశాల పాడిరైతులకు సూచించారు. మండలంలో ఈ నెల 25 వరకు టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పల్లెర్ల, నిడ్జింత, రెనివట్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏ రాజశేఖర్, ఓఎస్ యుద్ధం, ఆయా గ్రామాల గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని వల్లపల్లిలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరంలో జిల్లా వైద్యాధికారి డా శ్రీనివాస్‌కుమార్ పాల్గొని తనిఖీ చేశారు. మండలంలో ఇప్పటివరకు పశువులకు అందించిన టీకాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీకాంత్, శివారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపల్లిలో నివారణ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

మాగనూర్: మండలంలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మంగళవారం డబ్ల్యూహెచ్ఓ పల్స్‌పోలియో ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ విరేష్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం వివరాలు అడిగి తెలుకున్నారు. 0-5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారిణి విరోజతో కలిసి మండల కేంద్రం సమీపంలోని ఇట్టుక బట్టీల వద్దకు వెళ్లి అక్కడకు వచ్చిన వలస కూలీలకు సంబంధించిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారా..? లేదా ? అనే అంశంపై వారి దగ్గర వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ విరోజ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇటుక బట్టీ వద్ద తనిఖీ చేస్తున్న డాక్టర్ విరేష్